క్లుప్తంగా

వితరణ..



మైక్‌సెట్‌ను అందజేస్తున్న సూర్యం

పాతపట్నం: మండలంలోని పెద్దమల్లిపురం గ్రామంలో ఇటీవల నీలమణిదుర్గ ఆలయాన్ని ప్రారంభించారు. ఈ ఆలయానికి వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి రూ.25 వేల చేసే మైక్ సెట్‌ను వితరణ చేశారు. వీటిని గ్రామస్తులకు పార్టీ నియోజకవర్గ ఐటీ విభాగం కన్వీనర్ ఎనుగుతల సూర్యం శనివారం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ శ్రీనివాసరావు

పోలాకి: స్థానిక తహసీల్దార్‌గా పి.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సురేష్‌ను కలెక్టరేట్ ఈ–సెక్షన్‌కు సూపరింటెండెంట్‌గా డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

86 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

బూర్జ: మండలంలోని లక్కుపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 86 మందికి బూర్జ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ లఖినాన సరోజి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తనిఖీలు చేపట్టారు. బీపీ, సుగర్, దీర్ఘకాలిక రోగులకు మందులు అందజేశారు. ఏఎన్ఎం సి.హెచ్.చిన్నమ్ముడు, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



రమేష్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్, తదితరులు

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం గ్రామ పంచాయతీ తోవూరు గ్రామానికి చెందిన సవర రమేష్ అనే యువకునికి సర్పంచ్ తెంబూరు ప్రసాదరావుతోపాటు కొంతమంది వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల రమేష్ సెంట్రింగ్ పనులు చేస్తూ.. స్లాబ్ పైనుంచి జారిపడి గాయాలపాలయ్యాడు. శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. శ్రీకాకుళం వెళ్లి అతనికి రూ.6,600 ఆర్థిక సహాయం అందజేశారు. సహాయం చేసినవారిలో ఎస్.కల్యాణ్, విశ్వనాథ్, విజయ్ ఉన్నారు.

క్వారీ నిలిపివేత



క్వారీని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు, సిబ్బంది

జలుమూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనుమతులు లేని క్వారీలను నిలుపుదల చేస్తున్నామని తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. మెళియాపుట్టి మండలంలో క్వారీ ప్రమాదం జరిగిన నేపథ్యంలో క్వారీలను పరిశీలించినట్లు తెలిపారు. శనివారం జెమినివలస వద్ద క్వారీని పరిశీలించి అనుమతి పత్రాలు లేకపోవడంతో తాత్కాలికంగా నిలిపివేశామన్నారు. అనుమతి పత్రాలను ఆర్డీఓ కార్యాలయానికి తీసుకెళ్లాలన్నారు. మండల సర్వేయర్ నాగేశ్వరరావు, రెవెన్యూ పరిశీలకులు కిరణ్, సిబ్బంది ఉన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలన



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ గోపీబాల

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని(ఎస్‌డబ్ల్యూపీసీ) టెక్కలి డీఎల్‌పీఓ గోపీబాల శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ఉపాధి వేతనదారులతో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఈఓపీఆర్డీ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు.

భూమికి సారం..
వారికి జీవనాధారం



రైతు పొలంలో కాపువేసిన గొర్రెల మంద

- సేంద్రియ ఎరువుగా గొర్రెలు, మేకల వ్యర్థాలు
- భూసారం పెంచేదిశగా రైతుల అడుగులు
- జీవాల పెంపకమే వారికి ఆధారం

ఎల్.ఎన్.పేట: రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతుల్లో భూసారం పెంచేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. భూసారం పెంచేందుకు దోహదపడే వాటిలో రెండు పద్ధతులున్నాయి. మొదటిది పొలాల్లో గొర్రెలు, మేకల (జీవాల) మందలను కాయటం. రెండోది చెరువు పూడిక, కుళ్లిన గత్తం పొలాల్లో వేయటం. ఈ పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

తక్కువ ఖర్చుతో...

పగలంతా మేతకు వెళ్లిన గొర్రెలు, మేకలను రాత్రికి రైతు పొలానికి తీసుకువస్తారు. రాత్రంతా పొలంలో ఉంచుతారు. ఒక రాత్రి పొలంలో ఉంచటం వలన అవి వేసే పేడ(గెత్తం) భూసారం పెంచుతుంది. ఒక రాత్రి రైతు పొలంలో ఉంచేందుకు పది కుంచాల బియ్యం (30 కిలోలు), రూ.200 నగదు, కూరగాయాలు, చింతపండు, పప్పులను జీవాలు పెంచే వారికి రైతులు ఇస్తారు. ఎకరా పొలంలో నాలుగైదు రాత్రులు మంద కాయటం వలన భూమి సారవంతంగా మారుతుంది. పంట సమయంలో ఎరువులు, పురుగు మందుల ఖర్చు సగానికి తగ్గుతాయి. భూసారం పెంచేందుకు, పర్యావరణ పరిరక్షణకు మంద కాయటం ఎంతగానో దోహదపడుతుంది. పురుగు మందు, ఎరువుల అవశేషాల్లేని పంట దిగుబడులను సాధించవచ్చు.

వేసవిలో అనుకూలం..

వేసవిలో భూసారాన్ని పెంచేందుకు దోహదపడే వాటిలో గొర్రెలు, మేకల (జీవాల) మందలను కాసేందుకు ఎంతో అనుకూలం. ఖరీఫ్ తరువాత రబీలో ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలు వేసుకుంటారు. పంట కోత తరువాత మందలు కాస్తారు. వేసవిలో వర్షాలు పడినప్పుడు పొలం దుక్కి చేస్తారు. ఆ సమయంలో గొర్రెల, మేకల వ్యర్థాలు భూమిలో కలిసి భూసారాన్ని పెంచుతాయి.

పాతపట్నం నియోజకవర్గంలో...

పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 97 గ్రామాల్లో 2,800 కుటుంబాలవారు గొర్రెలు, మేకల కాపర్లు ఉన్నారు. వీరి వద్ద సుమారు 7 వేల జీవాలున్నాయి. మందలను మేతకు తీసుకుని వెళ్లి జీవనోపాధిని పొందుతుంటారు.

పూర్వీకుల నుంచి అలవాటు..



మాకు సుమారు వంద మేకలు, గొర్రెలు కలిసి మందగా ఉన్నాయి. మందల పెంపకం మా పూర్వీకుల నుంచి వస్తుంది. మా నాన్న నుంచి నేను కూడా మంద పెంచటం అలవాటు చేసుకున్నాను. మరో ఇద్దరు మనుషులతో కలిసి ప్రతీరోజు నాతోపాటు మందను మేతకు తీసుకువెళ్తాను. వేసవిలో రైతుల పొలాల్లో మంద కాయటం వలన బియ్యం, కొద్ది మొత్తంలో డబ్బులు, కూరగాయలు ఇస్తారు. పొలాల్లో మంద కాయటం వలన భూమికి ఎంతో మేలు జరుగుతుంది.

– బొమ్మాళి శిమ్మన్న, గొర్రెల మంద యజమాని, కృష్ణాపురం, ఎల్.ఎన్.పేట

భూసారం పెరుగుతుంది



పొలంలో గొర్రెలు, మేకల మందలను కాయటం వలన భూసారం పెరుగుతుంది. ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గుతుంది. పంట దిగుబడుల్లో వీటి ప్రభావం లేకుండా ఉంటుంది. ఎరువుల వాడకంతో మిత్ర పురుగులు నశిస్తాయి. భూమి పొరల్లో ఉంటే మిత్ర పురుగులు సంఖ్య పెరుగుతుంది. ప్రతీ ఏడాది మందలు కాయటం వలన భూమి సారవంతంగా మారుతుంది. పంట కాలంలో పెట్టుబడి తగ్గుతుంది.

– పైడి లతశ్రీ, ఏఓ, ఎల్.ఎన్.పేట

యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి



నూర్పుడి యంత్రాన్ని పరిశీలిస్తున్న త్రినాథస్వామి

నరసన్నపేట: వ్యవసాయ పనుల్లో యంత్రీకరణను వినియోగించడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి అన్నారు. మండలంలోని మాకివలసలో నూర్పుడి యంత్రం వినియోగాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యంత్రాల వినియోగించడం ద్వారా దిగుబడులు బాగున్నాయన్నారు.

జిల్లా వ్యాప్తంగా యంత్రీకరణపై రైతుల్లో అవగాహన పెరుగుతుందన్నారు. సామన్య రైతులకు యంత్ర పరికరాలు అందుబాటులోనికి రావాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న పరికరాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోమర్తిలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసాయాధికారి సునీత, ఉంగటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అందజేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రసాదరావు, డీ పట్టాదారులు

కొత్తూరు: భూముల రీ సర్వే చేసిన గ్రామల్లో డీ పట్టా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిర్ల ప్రసాదరావు కోరారు. తహసీల్దార్ బాలకృష్ణకు డీ పట్టా రైతులతో కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు.

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో డీ పట్టా భూములకు ఎల్‌పీఎం నంబర్ కేటాయించకపోవడంతో ఆన్‌లైన్‌లో అన్నదాత సుఖీభవ పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదన్నారు. అధికారులు స్పందించి రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఉన్న డీ పట్టా భూములకు ఎల్‌పీఎం నంబర్‌లు కేటాయించాలన్నారు. ఎల్‌పీఎం నంబర్‌లు కేటాయించకపోతే డీ పట్టాదారులతో కలిసి ఆందోళన చేస్తామన్నారు.

జూన్ ఆఖరికి వంతెన నిర్మాణం పూర్తిచేస్తాం



పాత వంతెనను కూల్చుతున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట వద్ద ఉన్న కడపలవానిగెడ్డ వంతెన నిర్మాణ పనులు జూన్ ఆఖరు నాటికి పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ ఏఈ గోపాల్ శనివారం తెలిపారు. వర్షా కాలంలో గట్టిగా వర్షం పడితే కడపలవాని గెడ్డపై నుంచి వరద నీటి ప్రవాహం పెరిగిపోతుంది. దీంతో దబ్బపాడు, తురకపేట గ్రామాల మధ్య కడపలవాని గెడ్డ వంతెనపై నుంచి రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితిని గుర్తించి సమస్యను జిల్లా అధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించగా రూ.67 లక్షలు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ప్రస్తుతం పాత వంతెన కూల్చే పనులు చేస్తున్నారు. వర్షాలు ప్రారంభం కాకముందే పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పరామర్శ..



అప్పన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

సరుబుజ్జిలి: మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన దాసరి అప్పన్న ఇటీవల పిడుగుపాటు గురై మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. ఆ కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ గజ్జన మోహన్‌రావు, పార్టీ నాయకుడు కరణం అసిరినాయుడు ఉన్నారు.

విసిగిస్తున్న విద్యుత్ కోతలు

- గత మూడు రోజులుగా సరఫరా నిలిపివేత
- అవస్థలు పడుతున్న ప్రజలు



పాతపట్నం 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్

పాతపట్నం: మండల వ్యాప్తంగా విద్యుత్ కోతలు విసిగిస్తున్నాయి. వేలాపాలా లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అప్రకటిత విద్యుత్ కోతలు విధించటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాలులు, వర్షాలు లేని సమయంలో కూడా ఎందుకు నిలిపివేస్తున్నారో తెలియడం లేదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి ఉదయం కరెంట్ పోతే ఎప్పుడు వస్తుందో తెలియడం లేదన్నారు. విద్యుత్ కోతలను ముందస్తుగా తెలియజేయాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే దోమలతో జాగారం చేయాల్సి వస్తోందని గ్రామీణ ప్రాంత వాసులు వాపోతున్నారు. కరెంట్ కోతలు కారణంగా నెట్ సర్వీసులు, పోస్టల్ సేవలు నిలిచిపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, మీ–సేవ కేంద్రాల్లో పనులు నిలిచిపోతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్ చేసినా స్పందించం లేదని వినియోగదారులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, లేనిపక్షంలో నిర్ణీత సమయాల్లో విద్యుత్ కోతలు విధించాలని వినియోగదారులు కోరుతున్నారు.

అనుమతి తప్పనిసరి



గారపేట వద్ద క్వారీని పరిశీలిస్తున్న డీఎస్పీ వివేకానంద

పొందూరు: క్వారీ నిర్వాహకులకు మైనింగ్ లీజు, ఇతర అనుమతులు తప్పనిసరిగా ఉండాలని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద తెలిపారు. శనివారం గారపేట సమీపంలోని క్వారీలను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా క్వారీ నిర్వహణ చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెళియాపుట్టిలో ముగ్గురి మృతి చెందిన సంఘటనపై ఎస్పీ ఆదేశాలతో మండలంలోని క్వారీలను పరిశీలించారు. క్వారీ నిర్వహణలో అనుమతులు పొందిన బ్లాస్టింగ్ నిర్వాహకుడు ఉండాలన్నారు. కూలీలతో బ్లాస్టింగ్‌లు చేయిస్తే క్వారీ అనుమతులు రద్దు చేయడంతోపాటు చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. అనుమతులు లేని క్వారీల వివరాలను అందించాలని ఎస్ఐ వి.సత్యనారాయణకు ఆదేశించారు.

విచారణ..

పొందూరు: మండలంలోని బాణాం గ్రామానికి చెందిన ఎస్.సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద శనివారం తండ్యాం పంచాయతీలోని మూడు మర్రిచెట్ల వద్ద విచారణ జరిపారు. బాణాం గ్రామానికి చెందిన రవిబాబు, మూడు మర్రిచెట్ల వద్ద త్రినాథస్వామి ఆలయ నిర్వాహకులు జ్యోతిస్వామి తనను కులంపేరుతో దూషించి దాడి చేసినట్లు సూరిబాబు పొందూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడు మర్రిచెట్ల వద్ద పలువురిని డీఎస్పీ విచారించారు. ఎస్ఐ వి.సత్యనారాయణ ఉన్నారు.

క్వారీలను నిలుపుదల చేయాలి

పొందూరు: మండలంలోని క్వారీలను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని తహసీల్దార్ వెంకటేష్ రామానుజుల క్వారీ నిర్వాహకులకు ఆదేశించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు గారపేట, రాపాక గ్రామాల్లో క్వారీలను ప్రాథమిక తనిఖీలు చేపట్టారు. క్వారీల సీనరేస్ ఉన్నాయా? లేదా? పరిశీలన చేశారు. కొద్ది రోజుల్లో మైన్స్, పోలీసు, రెవెన్యూ శాఖల సంయుక్త తనిఖీలు జరగనున్నాయన్నారు. ఉన్నతాధికారుల నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు తాత్కాలికంగా క్వారీలు నిలుపుదల చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఎస్ఐ సత్యనారాయణ, సర్వేయర్ గణపతి పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్

కొత్తూరు: మండలంలోని మాతల వంతెనపై అడుగుకో గుంత అనే శీర్షికతో ఈ నెల 15 తేదీన సాక్షిలో వెలువడిన వార్తకు ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. జేఈ గోపాలవారు పర్యవేక్షణలో వంతెనపై ఉన్న గుంతలను శనివారం పూడ్చే పనులు చేపట్టారు.



గుంతలను పూడ్చిన ఆర్అండ్‌బీ అధికారులు

కరకట్టలను నిర్మించేది ఎప్పుడు?



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలం లక్ష్మీనర్సుపేట వద్ద కోతకు గురవుతున్న వంశధార నదీ తీర భూములు. వంశధార నదీ తీరంలో కరకట్టల నిర్మాణం ఎప్పుడు జరుగుతుందని రైతులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రతీ ఏడాది వంశధార నదికి వచ్చిన వరదలు కారణంగా నదీతీరంలో ఉన్న పంట భూములు, పండ్ల తోటలు కోతకు గురవుతున్నాయి. విలువైన ఆస్తులను కోల్పోతున్నామని తీరంలోని లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు, బసవరాజుపేట తదితర గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కరకట్టల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - ఎల్.ఎన్.పేట

చెరువుకాదు.. రోడ్డే..



ఈ చిత్రం కొత్తూరు మండలం నివగాంలో గల పాలకొండ–హడ్డుబంగి రోడ్డు. ఇరువైపులా సీసీ డ్రైన్‌లు లేకపోవడంతో మురుగు నీటితోపాటు వర్షం నీరు రోడ్డుపై నిలిచి చెరువును తలపిస్తోంది. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాలను కలిపే ఈ రోడ్డు వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, గోతులను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

- కొత్తూరు

ప్రమాదకరంగా..



పాతపట్నం మండలంలోని తామర గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, మూడు రోడ్ల కూడలి పక్కనే మూడు అడుగుల ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీని చుట్టూ రక్షణ కూడా ఏర్పాటు చేయలేదు. ఎంపీపీ పాఠశాల అక్కడే ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- పాతపట్నం

మందుబాబులకు అడ్డాగా..



సారవకోట మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ కేంద్రం నిరుపయోగంగా ఉండటంతో పాటు శిథిలావస్థకు చేరుకుంది. మందుబాబులు ఇక్కడే మద్యం సేవించి సీసాలను విడిచిపెడుతున్నారు.

- సారవకోట

ఇంటర్వ్యూలు వాయిదా

సరుబుజ్జిలి: ఈ నెల 19వ తేదీన జరగాల్సిన ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ఎం.పావని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తదుపరి తేదీని ప్రకటిస్తామన్నారు. ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గ్రహించాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉపాధి వేతనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. మానవహారం, ర్యాలీలు ఏర్పాటు చేశారు. మండల, గ్రామ స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: మండల స్థాయి అధికారులకు సూచనలు చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



పాతపట్నం: కొరసవాడలో ప్రతిజ్ఞ చేస్తున్న వేతనదారులు



బూర్జ: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది